ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి



జగిత్యాల జిల్లా వార్తలు


5★★

శుక్రవారం 2 ఆగస్టు 2024

మహిళలకు సీఎం రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పాలి 8

బాధ్యతలు స్వీకరించిన కొండగట్టు ఆలయ ఈవో 6

ఎల్ఆర్ఎస్‌కు మోక్షం



- ప్రభుత్వ ఆదేశాలతో పరిష్కారం కానున్న దరఖాస్తులు
- అయిదు మున్సిపాలిటీలకు చేకూరనున్న ఆదాయం
- నాలుగు దశలుగా పరిశీలన
- ఫోన్ ద్వారా దరఖాస్తుదారులకు సమాచారం
- పరిష్కారానికి సిబ్బంది కొరత లేకుండా ఇతర శాఖల నుంచి డిప్యూటేషన్

జగిత్యాల, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ఎల్ఆర్ఎస్ (అనుమతి లేని లే అవుట్ల క్రమబద్ధీకరణ పథకం) దరఖాస్తులపై రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పెండింగ్ దరఖాస్తులను వేగంగా పరిష్కరించాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులకు ఆదేశాలు జారీ చేయడంతో ఈ ప్రక్రియలో కదలిక వస్తోంది. దీనికి తోడు తాజాగా ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారంపై ఉత్తర్వులు జారీ చేయడంతో ఫైళ్లు వేగంగా కదులుతున్నాయి. ఇ దేవాదాయ, వక్ఫ్, ప్రభుత్వ భూములు, కోర్టు వివాదాల్లో ఉన్న భూములు మినహా మిగితా లేఅవుట్లను క్రమబద్ధీకరించాలని నిర్ణయించడంతో జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, రాయికల్, ధర్మపురి పట్టణాల్లో ఇప్పటివరకు పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులకు మోక్షం కలగడంతో పాటు దాదాపు రూ. కోట్లలో బల్దియాలకు ఆదాయం సమకూరే అవకాశం ఏర్పడింది.

ఏళ్ల తరబడి పెండింగ్‌లో...

అనధికార ప్లాట్లు, లేఅవుట్ల క్రమబద్ధీకరణకు జగిత్యాల, కోరుట్ల, రాయికల్, ధర్మపురి, మెట్‌పల్లి పట్టణాల్లో వేల సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. రూ. వెయ్యి రుసుము చెల్లించి చాలా మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. వీటిని పరిశీలించి ప్రొసీడింగ్‌లు ఇచ్చేందుకు అప్పట్లో ప్రభుత్వం కలెక్టర్లకు బాధ్యతలు అప్పగించింది. ఈ క్రమంలోనే న్యాయపరమైన చిక్కుల కారణంగా ఈ ప్రక్రియ ముందుకు సాగలేదు. దరఖాస్తుల వివరాలను సెంటర్‌ఫర్ గుడ్ గవర్నెన్స్ (సీజీజీ) సేకరించి నిక్షిప్తం చేసింది. ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను పరిష్కరించాలని తాజాగా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో లేఅవుట్ల నిర్వాహకులు, ప్లాట్ల యజమానుల్లో ఆశలు చిగురించాయి.

ఫోన్ ద్వారా సమాచారం...

ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులు ప్లాట్లు, ఖాళీ స్థలాలు క్రమబద్ధీకరించుకోవడానికి ఆన్‌లైన్‌లో రూ. వెయ్యి మాత్రమే కట్టారు. ఆ తర్వాత పురోగతి లేకపోవడం అవసరం ఉన్న వారు మాత్రమే 14 శాతం ఫీజులు చెల్లించి భవన నిర్మాణ అనుమతులు తీసుకున్నారు. మిగితా పెండింగ్‌లో ఉన్న ఎల్ఆర్ ఎస్ దరఖాస్తుదారులకు సమాచారం ఇవ్వడానికి ఇప్పటికే వారి సెల్‌ఫోన్‌లకు సందేశాలు పంపించాలని అధికారులు వెల్లడించారు.

జాప్యం జరగకుండా ఉండేందుకు...

ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను పరిష్కరించడానికి ప్రత్యేక బృందాలు రంగంలోకి ఏర్పాటు చేయనున్నారు. పట్టణ ప్రణాళిక విభాగం టీపీవో, టీపీఎస్, టీపీబీవోలు బృందాలు ఏర్పడి ఆయా దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి ఆమోదించనున్నారు. జిల్లాలోని అయిదు మున్సిపాలిటీలోని పట్టణ ప్రణాళిక విభాగంలోని అధికారులు, సిబ్బంది కొరత ఉండటంతో దరఖాస్తుల పరిశీలన చేయడానికి జాప్యం జరగకుండా ఉండేందుకు ఇతర శాఖల నుంచి అధికారులు, సిబ్బందిని డిప్యూటేషన్‌పై తీసుకోవాలని యోచిస్తున్నారు.

నాలుగు దశలుగా పరిశీలన

ఎల్ఆర్ఎస్ కోసం చేసుకున్న దరఖాస్తులను నాలుగు దశలుగా పరిశీలించనున్నారు. తొలిదశలో దరఖాస్తులను క్షేత్ర స్థాయిలో సంబంధిత రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్, నీటి పారుదల శాఖ ఏఈ పరిశీలించి తిరస్కరణ చేయడం గానీ, ఆమోదించడం గానీ చేస్తారు. రెండో దశకు చేరుకున్న దరఖాస్తులను టౌన్ ప్లానింగ్, పంచాయతీ అధికా రులు మాస్టర్ ప్లాన్ ప్రకారం పరిశీలించి ఫీజు నిర్ణయిస్తారు. మూడో దశలో మున్సిపల్ కమిషనర్లు, అదనపు కలెక్టర్లు పరిశీలి స్తారు. దరఖాస్తులలో ఎలాంటి లోపాలు లేకుంటే వీరు ఆమోదిస్తారు. నాలుగవ దశలో కలెక్టర్ పరిశీలించి ఆమోదిస్తారు. మున్సిపాలిటీలు, జిల్లా స్థాయిలో హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేసే యోచనలో ప్రభుత్వం ఉంది. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారంపై ప్రభుత్వం దృష్టి సారించడంతో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న సమస్యలకు మోక్షం కలగనున్నట్లయింది.

మున్సిపాలిటీల్లో 26,815 దరఖాస్తులు...

ఎల్ఆర్ఎస్ పెండింగ్ దరఖాస్తులను ఆమోదించనుంది. వీటితో కొత్తగా దరఖాస్తులు స్వీకరించడానికి ప్రభుత్వం యోచిస్తుండడంతో జగిత్యాల, ధర్మపురి, కోరుట్ల, మెట్‌పల్లి, రాయకల్ మున్సిపాలిటీలకు దాదాపు రూ. కోట్లలో ఆదాయం వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. జిల్లాలో 31 ఆగస్టు 2020 నాటికి అప్పటి ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ అవకాశం కల్పించడంతో జిల్లాలోని అయిదు మున్సి పాలిటీల పరిధిలో 26,815 మంది ప్లాట్ల యజమానులు దరఖాస్తులు చేసుకున్నారు. ఇందులో జగిత్యాలలో 8,011, దరఖాస్తులు, ధర్మపురిలో 1,006, రాయికల్‌లో 1,600, కోరుట్లలో 9,518, మెట్‌పల్లిలో 6,680 దరఖాస్తులు వచ్చాయి. ఆ సమయంలో దరఖాస్తులు చేసు కోలేకపోయిన వారికి కూడా ఇప్పుడు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించడానికి ప్రభుత్వం యోచిస్తోంది.



అన్ని శాఖల సమన్వయంతో ఆపరేషన్ ముస్కాన్ విజయవంతం

ఎస్పీ అశోక్ కుమార్

జగిత్యాల టౌన్, ఆగస్టు 1 :అన్ని శాఖల సమన్వయంతో ఆపరేషన్ ముస్కాన్-10 విజయవంతం అయినట్లు ఎస్పీ అశోక్ కుమార్ పేర్కొన్నారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో గురువారం పోలీస్ అధికారులతో ఎస్పీ సమావేశం నిర్వహించి మాట్లాడారు. గత జూలై 1 నుంచి 31 వరకు జిల్లాలో ఆపరేషన్ ముస్కాన్-10 కార్యక్రమాన్ని నిర్వహించి 30 మంది బాల కార్మికుల ను గుర్తించామన్నారు. బాలల హక్కులను కాపాడాల్సిన భాద్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఎవరైనా సరే బాలలను పనిలో పెట్టుకున్నా, వదిలివేసినా, తప్పిపోయినా తదితర సమాచారం తెలిసిన వారు డయల్ 100కు సమాచారం అందించాలని కోరారు. పోలీస్ శాఖతో కలిసి ఆపరేషన్ ముస్కాన్-10 విజయవంతం చేయడంలో కృషి చేసిన అధికారులను ఎస్పీ అభినం దించారు.

జిల్లాలో పోలీస్ యాక్ట్..

జగిత్యాల జిల్లాలో ఆగస్టు మాసం చివరి వరకు పోలీసు యాక్ట్ అమలులో ఉంటుందని ఎస్పీ అశోక్ కుమార్ పేర్కొన్నారు. జిల్లా పరిధిలో ఎలాంటి ధర్నాలు, ర్యాలీలు, రాస్తారకోలు, సభలు, సమావేశాలు నిర్వహించకూడ దన్నా రు. వివిధ కార్యక్రమాల నిర్వాహణకు ముందుగా పోలీసు అనుమతి తీసుకో వాలన్నారు. శాంతి భద్రతల పరిరక్షణకు నిరంతరం శ్రమిస్తున్న పోలీసులకు అన్ని వర్గాల ప్రజలు సహకారం అందించాలని సూచించారు.

మా వాదనలు సుప్రీం కోర్టులో వినిపించాం

ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



అసెంబ్లీలో మాట్లాడుతున్న అడ్లూరి

ధర్మపురి, ఆగస్టు 1: ఎస్సీ వర్గీకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం తరపున తాము ఢిల్లీకి వెళ్లి సుప్రీం కోర్టులో వాదనలు వినిపించామని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. ఎస్సీ వర్గీకరణ కోసం సుప్రీం కోర్టులో ఏడుగురు సభ్యులతో కూడిన ధర్మాసనం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన సందర్భంగా అసెంబ్లీ వేదికగా గురువారం ఆయన ప్రసంగించి సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. దేశంలో సీనియర్ కౌన్సిల్స్‌ను ఎంగేజ్ చేయడానికి ఎంతఖర్చు అవుతుందో రాష్ట్ర ప్రభుత్వం భరించడానికి సిద్ధంగా ఉందని సీఎం స్పష్టం చేసినట్లు తెలిపారు. వర్గీకరణ పైన సుప్రీం కోర్టులో అనుకూలంగా తీర్పు వస్తే ప్రతి పక్ష నాయకులు సహకరించాల్సింది పోయి గలాటా చేయడం సరికాదన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఒక ఆదివాసి మహిళా సోదరి, మంత్రి సీతక్క గురించి అహంకార పూరిత మాటలు మాట్లాడం తన స్థాయికి తగదన్నారు. ఎస్సీ వర్గీకరణ కోసం సుప్రీం కోర్టులో గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన నేపథ్యంలో రాష్ట్ర మంత్రి దామోదర రాజనర్సింహ, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, సహచర ఎమ్మెల్యేలు సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాద పూర్వ కంగా కలిసి శాలువా కప్పి సన్మానించారు.

సుప్రీ తీర్పు హర్షణీయం : ఎమ్మెల్సీ

జగిత్యాల, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): సుప్రీం కోర్టులో ఎస్‌సీలలో ఏబీసీడీ వర్గీకరణకు అనుగుణంగా తీర్పు రావడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నానని ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2004 సంవత్సరంలో ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఎస్సీ వర్గీకరణకు అనుగుణంగా నిర్ణయం కోసం శాసన సభలో తీర్మాణంతో పాటు అప్పటి యూపీఏ ప్రభుత్వానికి నివేదించారని గుర్తు చేశారు. ఇంత వరకు వివక్షతకు అవుతున్న వర్గానికి ఉప శమనంగా బావిస్తున్నానన్నారు.

ఎస్‌సీ వర్గీకరణకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టి అమలు చేయుటకు సీఎం రేవంత్‌రెడ్డి శాసనసభలో ప్రకటించడం అభినందనీయమన్నారు.

బ్రిడ్జిపై నిలిచిపోయిన గ్రానైట్ ట్రక్కు

- రాకపోకలు నిలిచి ప్రజల ఇక్కట్లు

మల్యాల, ఆగస్టు 1: గ్రానైట్ రాళ్లను తరలిస్తున్న ట్రక్కు బ్రిడ్జిపై నిలిపోవడంతో రాకపోకలు నిలిచి ప్రజలు ఇబ్బందుటు పడ్డారు. మండలంలోని రామన్నపేట- మద్దుట్ల గ్రామాల మధ్య గల వరదకాలువ బ్రిడ్జిపై గ్రానైట్ ట్రక్కు మరమ్మత్తులకు గురి అయింది. దీంతో రాకపోకలు లేకుండా గురువారం వేకువజాము నుంచి మధ్యాహ్నం వరకు అలాగే నిలిచి పోయి ఉండడంతో గ్రామస్థులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. వాహనాలు వెళ్లలేకుండా, నడిచివెళ్లె మార్గం లేకుండా ఇబ్బందులు పడ్డారు. పాఠశాలకు విద్యార్థులను తరలించే వాహనాలు రాలేని పరిస్థితి ఏర్పడింది. గ్రానైట్ ట్రక్కులను గ్రామాల మధ్య నుంచి కాకుండా బైపాస్ మార్గాల నుంచి వెళ్లెలా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు

కొండగట్టులో 5 నుంచి శ్రావణ ఉత్సవాలు

మల్యాల, ఆగస్టు 1: కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయంలో 5వ తేదీ నుంచి శ్రావణ సప్తాహ ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఈవో రామకృష్ణ తెలిపారు. వారం రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలలో నిత్యం స్వామి వారికి, వెంకటేశ్వరస్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజ కార్యక్రమాలను ఆలయ అర్చకులు, వేద పండితులు జరిపుతారని తెలిపారు. అలాగే దివ్య ప్రబంధం, సుందరకాండ పారాయణం, విష్ణు సహస్ర పారాయణం, హనుమాన్ చాలీసా, రామభజన నిర్వహించనున్నట్లు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

- అంజన్నను దర్శించుకున్న సినీనటుడు

సినీనటుడు పృథ్వీరాజ్ కుటుంబసమేతంగా కొండగట్టు ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. పృథ్వీరాజ్‌ను మండల బీజేపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు.

'ఆర్యవైశ్యులు అన్ని రంగాల్లో రాణించాలి'

జగిత్యాల, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్యులు అన్ని రంగాల్లో రాణించాల్సిన అవసరముందని ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు అమరావది లక్ష్మీనారాయణ అన్నారు. ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడిగా నూతనంగా ఎన్నికయిన మైలారపు లింబాద్రి, మెట్‌పల్లి ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మైలారపు రాంబాబులతో పాటు పలువురు నాయకులు గురువారం హైద్రాబాద్‌లో మర్యాద పూర్వకంగా రాష్ట్ర అధ్యక్షుడు అమరావది లక్ష్మీనారాయణను కలిశారు. నూతన అధ్యక్షునిగా ఎన్నికయిన మైలారపు లింబాద్రిని శాలువ కప్పి సన్మానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. ఆర్యవైశ్యుల సంక్షేమానికి మహా సభ విశేష కార్యక్రమాలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రారైస్ మిల్ అసోసియేషన్ అధ్యక్షుడు నూనె శ్రీనివాస్, అవోపా జిల్లా నాయకులు పబ్బ శ్రీనివాస్, నాయకులు మైలారపు రాంబాబు, రాజేశ్, శ్రీనివాస్, ఎలిమి రవి కుమార్, కిరణ్, సతీష్, శంకర్, నవీన్, చకిణం కేదరి నాథ్, పాల్గొన్నారు.

కుక్కల దాడిలో పలువురికి గాయాలు

రాయికల్, ఆగస్టు 1: రాయికల్ పట్టణంలోని 1, 8వ వార్డులలో గురువారం కుక్కలు దాడి చేయగా పలువురికి గాయాలయ్యాయి. ఆకుల వెంకటమ్మ, పద్మ, హజారా, తోకల లక్ష్మీనర్సయ్య, తోకల లక్ష్మి, బద్దం రాజుభాయ్‌లతో పాటు పలువురికి గాయాలు కాగా ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి చికిత్స తీసుఉన్నారు. కుక్కల బారి నుంచి కాపాడాలని గ్రామస్థులు కోరుతున్నారు.

వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పు చారిత్రాత్మకం

- సామాజిక ఉద్యమాల్లో ఎమ్మార్పీఎస్ ఉద్యమం ప్రత్యేకం
- ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు దుమాల గంగారాం



జగిత్యాలలో సంబరాల్లో పాల్గొన్న ఎమ్మార్పీఎస్ నాయకులు

జగిత్యాల అర్బన్, జూలై 1: ఎస్సీ వర్గీకరణ అంశంలో కొనసాగుతున్న సుదీర్ఘ పోరాటంపై మాదిగల ఆకాంక్షలు చాటిచెప్పేలా దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు చారిత్రాత్మకం అని మహజన సోషలిస్టుపార్టీ(ఎంఎస్పీ) జిల్లా అధ్యక్షుడు దుమాల గంగారం అన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని స్థానిక తహశీల్ చౌరస్తా వద్ద ఎంఆర్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సురుగు శ్రీను ఆధ్వర్యంలో వర్గీకరణ సానుకూల తీర్పుపై టపాకాయలు కాల్చి, స్వీట్లు పంచి సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గంగారాం మాట్లాడుతూ సుమారు ముప్పై ఏళ్లుగా హక్కుల కోసం తెలుగు నేలన సామాజిక ఉద్యమాలు చేసిన ఘనత ఎంఆర్పీఎస్‌కే దక్కిందన్నారు. అనేక ఆటుపోట్లు అధిగమిస్తూ అనేక ఏళ్లుగా ఉద్యమం సజీవంగా నిలబడిందంటే కేవలం మంద కృష్ణ నాయకత్వం వల్లనే సాధ్యం అయ్యిందన్నారు. గతంలో సాధించిన ఎస్సీ వర్గీకరణ ఉద్యమం ఫలితంగా 25వేల ఉద్యోగాలు దక్కించుకున్నామని గుర్తుచేశారు. కేవలం వర్గీకరణ ఉద్యమానికే కాకుండా చిన్నారుల గుండె జబ్బులు, పెన్షన్‌ల కోసం, తెలంగాణ అమరుల కోసం, హత్యలు, హత్యాచార బాధిత కుటుంబాలకు న్యాయం చేకూర్చేందుకు ఎంఆర్పీఎస్ పోరాటం చేసి సఫలీకృతం అయ్యిందన్నారు. వర్గీకరణకు సహకరించిన దేశ ప్రధాని మోదీ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, ఏపీ సీఎం చంద్రబాబునాయుడుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సుప్రీంకోర్టు తీర్పు హర్షణీయం అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్పీఎస్ నాయకులు బాలె శంకర్, దుమాల రాజ్‌కుమార్, సతీష్, గంగాధర్, కిషన్, రమేష్, సురేందర్, మోహన్, సాయిలు, సునీల్, రమేష్, సతీష్, కుమారస్వామి తదితరులున్నారు.

పల్లెల్లో పరిశుభ్రతపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ గౌతం రెడ్డి

జగిత్యాల, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): పల్లెల్లో పరిశుభ్రతపై అధికారులు దృష్టి సారించాలని జిల్లా అదనపు కలెక్టర్ గౌతంరెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో గల ఆడిటోరియంలో పలు ప్రభుత్వ విభాగాలకు చెందిన అధికారులు, ఉద్యోగులతో సానిటేషన్‌పై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ప్రస్తుత వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పల్లెల్లో పచ్చదనం, పరిశుభ్రతను పాటించాలన్నారు. నీరు నిలువ ఉండకుండా జాగ్రత్తలు వహించాలన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ ఇన్‌చార్జి అధికారి రఘువరన్, డీఆర్‌డీవో సంపత్ రావు, మండల పంచాయతీ అధికారులు, పంచాయతీ సెక్రటరీలు పాల్గొన్నారు.

బుగ్గారం ఏఎస్ఐ సస్పెన్షన్

జగిత్యాల టౌన్, ఆగస్టు 1 : జిల్లాలోని బుగ్గారం పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఏఎస్సై లక్ష్మీనారాయణను సస్పెండ్ చేస్తూ మల్టీజోన్-1 ఐజీ చంద్రశేఖర్ రెడ్డి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఏఎస్ఐ లక్ష్మీనారాయణ విధుల్లో భాగంగా ఎస్సైతో పాటు సిబ్బందితో దురుసుగా ప్రవర్తించినందుకుగాను క్రమ శిక్షణ చర్యల్లో భాగంగా సస్పెండ్ చేసినట్లు ఉత్తర్వులో ఐజీ పేర్కొన్నారు.

వయోవృద్ధుల సంక్షేమానికి కృషి

హరి అశోక్ కుమార్

జగిత్యాల, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): వయోవృద్ధుల సంక్షేమానికి అవసరమైన కృషిని చేస్తున్నామని సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు హరి అశోక్ కుమార్ అన్నారు. గురువారం పట్టణంలోని అసోసియేషన్ కార్యాలయంలో కుమారుల నిరాదారణకు గురైన రాయికల్ మండలం అల్లీపూర్ గ్రామానికి చెందిన ఓ బాధిత వృద్ధురాలు తన ఇబ్బందుల గురించి ఫిర్యాదు అందించారు. వెంటనే సమస్యను ఆర్‌డీవో మధుసూదన్ దృష్టికి తీసుకవెళ్లి పరిష్కరించాలని కోరారు. ఈసందర్భంగా హరి అశోక్ కుమార్ మాట్లాడుతూ వృద్ధాప్యంలో తల్లిదండ్రుల బాగోగులను పట్టించుకోని కుమారులపై వయోవృద్ధుల సంరక్షణ చట్టం కింద చర్యలు తీసుకోవాల్సిన అవసరముందన్నారు.

భాషా సామర్థ్యాల పెంపునకు కృషి చేయాలి

రాయికల్, ఆగస్టు 1: విద్యార్థుల్లో భాషా సామర్థ్యాల పెంపునకు భాషోపాధ్యాయులు కృషి చేయాలని మండల నోడల్ అధికారి ఎస్.రాఘవులు అన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే న్యాస్ శిక్షణలో భాగంగా గురువారం రాయికల్ బాలుర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాయికల్, మేడిపల్లి, భీమారం మండలాల తెలుగు పండితులకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులు సైతం తెలుగును సరిగా చదవడం, రాయలేకపోతున్నారని సర్వే వెల్లడించిందన్నారు. జిల్లా రిసోర్స్ పర్సన్ నారంబట్ల హరిప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు తక్కువగా ఉన్నాయని, భాషాభివృద్ధికి వ్యూహాలు రూపొందించుకోవాలని అన్నారు. తెలుగు రిసోర్స్ పర్సన్ చెరుకు మహేశ్వర శర్మ, మోతుకుల నారాయణ గౌడ్‌లు మాట్లాడుతూ న్యాస్ సర్వేలో భాగంగా నిర్వహించే తెలుగు పరీక్షలపై అవగాహన పెంచేందుకు సమావేశం ఉద్దేశ్యమని అన్నారు. నవంబరు నెలలో 3, 6, 9 తరగతులకు న్యాస్ పరీక్షల నిర్వహణ ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ రిసోర్స్ పర్సన్ కుడుకల రవీందర్, తెలుగు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్వచ్ఛదనం..పచ్చదనం పకడ్బందీగా నిర్వహించాలి

అధికరులకు కలెక్టర్ సత్య ప్రసాద్ ఆదేశాలు



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్, ఇతర అధికారులు

జగిత్యాల, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో స్వచ్ఛదనం..పచ్చదనం కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ సత్య ప్రసాద్ అధికారులను ఆదేశించారు. గురువారం హైద్రాబాద్ నుంచి సీఎస్ శాంతి కుమారి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు కలెక్టర్‌తో పాటు పలువురు అధికారులు హాజరయ్యారు. అనంతరం అధికారులనుద్దేశించి కలెక్టర్ మాట్లాడారు. ఈనెల 5వ తేదీ నుంచి 9వ తేదీ వరకు గ్రామాల్లో స్వచ్ఛదనం...పచ్చదనం కార్యక్రమాలను చేపట్టాలన్నారు. నిర్ణీత షెడ్యూల్ ప్రకారం కార్యక్రమాలు పూర్తి చేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో లోకల్ బాడీ అడిషనల్ కలెక్టర్ గౌతంరెడ్డి, డీఆర్‌డీవో సంపత్ రావు, ఇంచార్జీ డీపీవో రఘువరన్, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి

ప్రభుత్వ ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని కలెక్టర్ ఆదేశించారు. గురువారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో హైస్కూల్ ప్రధానోపాధ్యాయులతో సమీక్ష సమావేశాన్ని నిర్వ హించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. చదువులో వెనుకబడి ఉన్న విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఇంగ్లీష్, హిందీ, మ్యాథ్స్ సబ్జెక్టులలో పిల్లలకు చదవడం, రాయడంపై ప్రత్యేక తరగులు నిర్వహించాలన్నారు. ప్రతీ పాఠశాలల్లో బేసిక్ టెస్ట్ నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఈవో జగన్ మోహన్ రెడ్డి, పలువురు అధికారులు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

కొండగట్టు ఈవోగా రామకృష్ణ



నూతన ఈవోకు ప్రసాదాలు అందజేస్తున్న అర్చకులు

మల్యాల, ఆగస్టు 1: కొండగట్టు అంజనేయస్వామి దేవస్థానం నూతన ఈవోగా నియమితులైన ఎం.రామకృష్ణ గురువారం బాధ్యతలు చేపట్టారు. దేవాదాయ శాఖలో డిప్యూటీ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తూ సాధారణ బదిలీల్లో భాగంగా ఈవోగా నియమితులైన అనంతరం కొండపైకి వచ్చిన ఆయన మొదట స్వామిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఈవోకు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. అనంతరం దేవస్థానం కార్యాలయంలో ప్రస్తుతం ఇన్‌చార్జి ఈవోగా కొనసాగుతున్న ఉమ్మడి కరీంనగర్ జిల్లా దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ ఆకునూరి చంద్రశేఖర్ నుంచి పూర్తి స్థాయి ఈవోగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు, అర్చకులు నూతన ఈవోను కలిసి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో అంజయ్య, పర్యవేక్షకులు శ్రీనివాస్‌శర్మ, సునీల్, సీనియర్ అసిస్టెంట్‌లు ఉపాధ్యాయుల చంద్రశేఖర్, రాజేశ్వర్‌రావు, లతాదేవి, లక్ష్మారెడ్డి, ధర్మేందర్, శ్రీనివాస్, లక్ష్మిరాజం, సంపత్, సుధాకర్‌రెడ్డి ఉన్నారు.

వాహన త్రైమాసిక పన్నుల బకాయిలు చెల్లించాలి : డీటీసీ

తిమ్మాపూర్, ఆగస్టు1: వాహనాల యాజమానులు త్రైమాసిక పన్ను బకాయిలను సకాలంలో చెల్లించాలని జిల్లా ఉప రవాణా శాఖ కమిషనర్ పి.పురుషోత్తం కోరారు. జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో నగరంలోని బైపాస్‌లోని లారీ ఓనర్ అసోసియేషన్ కార్యాలయం వద్ద ప్రచార వాహనాన్ని డిటిసి పురుషోత్తం జెండా ఊపి ప్రారంభిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్రైమసిక పన్ను బకాయిలు నిర్ణీత సమయంలో చెలించని వాహనాలు తనిఖీల్లో పట్టుబడితే 200శాతం అపరాధ రుసుముతో పాటు వాహనం జప్తు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. వాహనదారులు త్రైమాసిక పన్నులు సకాలంలో చెల్లించాలని ప్రచారం చేసేందుకు ప్రచార వాహనం ప్రారంభించినట్లు తెలిపారు. ఈ ప్రచార రథం జిల్లాలోని అన్ని మండలాలలో తిరుగుతూ సకాలంలో పన్నులు చెల్లించాలని ప్రచారం చేస్తుందని అన్నారు. ఇప్పటికైనా వాహనదారులు బకాయిగా ఉన్న త్రైమసిక పన్నుల బకాయిలు చెల్లించాలని డిటిసి పురుషోత్తం కోరారు. ఈ కార్యక్రమంలో మోటర్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్లు శ్రీకాంత్ చక్రవర్తి, రవి కుమార్, అసిస్టెంట్ మోటర్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ అభిలాష్, కానిస్టేబుల్స్, హోంగార్డులు, లారీ అసోసియేషన్ అధ్యక్షులు పెద్ది రమేష్, లారీ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ నేత కార్మికుడి మృతి

గంగాధర, ఆగస్టు 1: చికిత్స పొందుతూ నేత కార్మికుడు మృతి చెందినట్లు ఏఎస్సై రమణారెడ్డి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. రామడుగు మండలం షానగర్‌కు చెందిన మిట్టపల్లి రమేష్(45) ఇంటి వద్ద సాంచాలు నడుపుతూ జీవిస్తున్నాడు. కొన్ని రోజులుగా ఆర్థికంగా ఇబ్బందులు పడుతూ అనారోగ్యంతో బాధపడుతూ జీవితంపై విరక్తి చెంది గంగాధర మండలం కురిక్యాల శివారులో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. అపస్మారక స్థితిలో ఉన్న ర మేష్‌ను స్థానికులు గమణించి 108 సమాచారం అందించగా కరీంనగర్‌కు తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించాలని వైద్యుల సూచనల మేరకు నిమ్స్‌కు తరలించి చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడి తమ్ముడు మిట్టపల్లి నరేష్ "ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎఎస్‌ఐ తెలిపారు.

రూ.7,200 పలికిన పత్తి ధర

జమ్మికుంట: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7,200 పలికింది. గురువారం ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర రూ.7,200, కనిష్ఠ ధర రూ.7,100 చెల్లించి కొనుగోళ్లు చేపట్టారు.

ఆగస్టు, సెప్టెంబరులోనూ జోరు వానలు!

▸ భారత వాతావరణ శాఖ అంచనా

విశాఖపట్నం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): నైరుతి రుతుపవనాల సీజన్‌లో తొలి అర్ధభాగం మంచి వర్షాలు కురిశాయి. అదేజోరు ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో కొన సాగనుంది. రెండు నెలల్లో దేశంలోని అనేక ప్రాంతాల్లో సాధారణం, అంతకంటే ఎక్కువ వర్షపాతం (దీర్ఘకాలిక సగటులో 106 శాతం) నమోదవుతుంది. అయితే ఈశాన్య రాష్ట్రాలు, తూర్పు భారతంలో కొన్ని ప్రాంతాలు, సౌరాష్ట్ర, లద్దాక్, మధ్య, దక్షిణ భారతంలో కొన్ని ప్రాంతాల్లో సాధారణం, అంతకంటే తక్కువ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అంచనా వేసింది. ఆగస్టు నెలలో ఈశాన్య రాష్ట్రాలు, వాయవ్య, మధ్య, తూర్పు, దక్షిణాదిలో పలు భాగాలు, కశ్మీర్, లద్దాక్ వంటి ప్రాంతాలు తప్ప దేశంలో మిగిలిన ప్రాంతాల్లో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదవుతుంది. ఈ మేరకు ఆగస్టు, సెప్టెంబరు నెలలకు సంబంధించి ముందస్తు అంచనా నివేదికను వాతావరణ శాఖ గురువారం విడుదల చేసింది.

ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో దేశంలో 422.8 మి.మీ వర్షపాతం (1971 నుంచి 2020 వరకు నమోదైన వర్షపాతం సగటులో 106 శాతం) నమోదవుతుందని తాజా బులెటిన్‌లో పేర్కొంది. ఆగస్టులో దేశంలో 254.9 మి.మీ. (1971 నుంచి 2020 వరకు నమోదైన వర్షపాతం సగటులో 94 నుంచి 106 శాతం వరకు) నమోదు కానుంది. ఆగస్టులో దక్షిణాది రాష్ట్రాల్లో తప్ప దేశంలోని అనేక ప్రాంతాల్లో గరిష్ఠ, కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదవుతాయని తెలిపింది. కాగా, ఆగస్టులో దక్షిణ కోస్తా, సీమల్లో ఎక్కువ, ఉత్తర కోస్తాలో తక్కువ వర్షాలు ఆగస్టు నెలలో దక్షిణ కోస్తా, రాయలసీమల్లో సాధారణం, అంతకంటే ఎక్కువ వర్షాలు కురవనున్నాయి. ఉత్తర కోస్తాలోని ఎక్కువ ప్రాంతాల్లో సాధారణం, అంతకంటే తక్కువ వర్షాలు కురుస్తాయి. ఉత్తర తెలంగాణ, ఉత్తర కోస్తాలతోపాటు, దక్షిణ ఛత్తీస్‌గఢ్‌లో సాధారణం కంటే తక్కువ వర్షాలు కురవనున్నాయని వాతావరణ శాఖ అంచనా వేసింది.

ఇది జాతీయ విపత్తే

మా నాన్నను కోల్పోయినప్పటి పరిస్థితి గుర్తుకొచ్చింది: రాహుల్‌గాంధీ

▸ సోదరి ప్రియాంకతో కలిసి.. ముండక్కై, చురాల్‌మలలో పర్యటన

▸ జాతీయ విపత్తుగా ప్రకటించాలి: పినరయి

▸ 289కి పెరిగిన మరణాలు



పునరావాస శిబిరంలో బాధితులను ఓదారుస్తున్న రాహుల్, ప్రియాంక

వయనాడ్, ఆగస్టు 1: "వయనాడ్‌లో తీవ్ర విషాదం నెలకొంది. ఆ దృశ్యాలు హృదయాన్ని తీవ్రంగా గాయపరుస్తున్నాయి. నాకు ఏం చెప్పాలో తెలియడం లేదు. మా నాన్న చనిపోయినప్పుడు ఎలా ఉండేదో.. ఇప్పుడు అలాంటి బాధనే ఎదుర్కొంటున్నాను. నా దృష్టిలో ఇది జాతీయ విపత్తే" అని లోక్‌సభలో విపక్ష నేత, కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్‌గాంధీ ఉద్వేగంతో అన్నారు. గురువారం ఆయన తన సోదరి ప్రియాంక గాంధీతో కలిసి వయనాడ్‌లో కొండచరియల బాధిత ప్రాంతాలు-- ముండక్కై, చురాల్‌మల, అట్టమల, మెప్పాడిలో పర్యటించారు. ఈ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పునరావాస శిబిరాల్లో, ఆస్పత్రుల్లో బాధితులతో మాట్లాడారు. "దేశం మీ వెన్నంటే ఉంది.." అంటూ వారికి ధైర్యం చెప్పారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఇది బాధాకరమైన పరిస్థితి అని.. పినరయి ప్రభుత్వం బాధితులకు అన్ని విధాలా సాయం చేయడానికి కట్టుబడి ఉందని చెప్పారు. ముందే హెచ్చరించామంటూ లోక్‌సభలో హోంమంత్రి అమిత్‌షా చేసిన ప్రకటన గురించి విలేకరులు ప్రస్తావించగా.. "ఇది రాజకీయ ఘర్షణకు సమయం కాదు. అన్ని వ్యవస్థలు కలిసికట్టుగా పనిచేయాల్సిన తరుణమిది" అని వ్యాఖ్యానించారు. కరోనా కష్టకాలంలో తాను, ప్రియాంక వయనాడ్ ప్రజలకు అండగా ఉన్న విషయాన్ని గుర్తు చేస్తూ.. ఇప్పుడు కూడా సహాయక చర్యలు, పునరావాస కార్యక్రమాలను నిశితంగా పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. అనంతరం ఇదే విషయాన్ని తన ఎక్స్, ఫేస్‌బుక్ ఖాతాల్లో పోస్ట్ చేశారు. మరోవైపు కేరళ సీఎం పినరయి విజయన్ కూడా వయనాడ్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 280కి పైగా పౌరులు చనిపోయారని, కేంద్రం జాతీయ విపత్తుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. జాతీయ విపత్తుగా ప్రకటించడానికి అభ్యంతరం ఏంటని ప్రశ్నించారు. సహాయక చర్యల్లో పాల్గొంటున్న సైన్యం, రెస్క్యూ వర్కర్లు, స్థానికులను ఆయన అభినందించారు. ఆర్మీ జాగిలాలు మృతదేహాలను గుర్తిస్తున్నాయని, నదిలో కొట్టుకుపోయిన శరీర భాగాలను వెలికితీసే ప్రయత్నాలు జరుగుతున్నాయని చెప్పారు. కాగా.. కొండచరియలు విరిగిపడ్డ ఘటనల్లో మృతుల సంఖ్య 289కి పెరిగినట్లు అధికారులు వివరించారు. గల్లంతైన వారి ఆచూకీ తెలుసుకునేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన తెలిపారు.

డార్క్ టూరిజం వద్దు

వయనాడ్‌లో డార్క్ టూరిజానికి రావొద్దంటూ కేరళ పోలీసులు సామాజిక మాధ్యమాల్లో విజ్ఞప్తి చేశారు. దీంతో.. 'డార్క్ టూరిజం' అనే పదం వైరల్‌గా మారింది. 'చెర్నోబిల్ అండ్ ది డార్క్ టూరిస్ట్' టీవీ షోతో ఈ పదం బాగా పాపులర్ అయింది. మరణం, విషాదం, హింస చోటుచేసుకుని, అసాధారణ పరిస్థితులు ఉండే ప్రదేశాలను సందర్శించడాన్ని డార్క్ టూరిజం అంటారు. ఉదాహరణకు ఉక్రెయిన్‌లోని చెర్నోబిల్ (అణు విద్యుత్తు కేంద్రం) ఘటన, కాంబోడియాలో కిల్లింగ్ ఫీల్డ్స్, పోలెండ్‌లోని అశ్విట్జ్ క్యాంప్ వంటివి డార్క్ టూరిజం కిందకు వస్తాయి. ఇప్పుడు వయనాడ్‌కు డార్క్ టూరిస్టులు వస్తే.. సహాయక చర్యలకు ఆటంకాలేర్పడతాయని కేరళ పోలీసులు ఆందోళన వ్యక్తం చేశారు.

హమాస్‌కు భారీ దెబ్బ!

▸ ఇజ్రాయెల్‌పై దాడుల వ్యూహకర్త మిలిటరీ చీఫ్ డెయిఫ్ హతం!

▸ జూలై 13న గాజాలో అంతం చేశాం

▸ ప్రకటించిన ఇజ్రాయెల్ సైన్యం

▸ ఆ ప్రకటనను ఖండించిన హమాస్

జెరూసలెం, ఆగస్టు 1: హమాస్‌కు మరో భారీ దెబ్బ తగిలింది. ఇరాన్ రక్షణలో ఉన్న హమాస్ చీఫ్ ఇస్మాయిల్ హనియా హత్యకు గురైన మరునాడే హమాస్ మిలిటరీ చీఫ్, ఇజ్రాయెల్‌పై దాడుల వ్యూహకర్త మహమ్మద్ డెయిఫ్ హతమయ్యాడు. డెయిఫ్‌ను తమ సైన్యం అంతం చేసినట్లు ఇజ్రాయెల్ గురువారం అధికారికంగా ప్రకటించింది. తన ప్రకటనలో ఆపరేషన్ వివరాలను వెల్లడించింది. "మా సైన్యం (ఐడీఎఫ్) గత నెల 13న గాజాలోని ఖాన్ యూనిస్ ప్రాంతంపై జెట్లతో దాడి చేసింది. అక్కడ హమాస్‌కు చెందిన డిప్యూటీ కమాండరు నివాసంలో డెయిఫ్ ఉన్నట్లు గుర్తించాం. అక్కడ జెట్లతో బాంబులు ప్రయోగించాం. ఈ దాడిలో డెయిఫ్ హతమయ్యాడు" అని ఆ ప్రకటనలో తెలిపింది. గత ఏడాది అక్టోబరు ఏడున ఇజ్రాయెల్ భూభాగంపై జరిగిన దాడుల ఆలోచన, ప్రణాళిక, అమలు అంతా డెయిఫ్ నేతృత్వంలో జరిగిందని ఇజ్రాయెల్ ఆరోపిస్తోంది. ఈ దాడుల్లో 1197 మంది ఇజ్రాయెల్ పౌరులు చనిపోయారు. కాగా, డెయిఫ్ మరణవార్తపై హమాస్ స్పందించింది. ఖాన్ యూనిస్‌పై జూలైలో ఇజ్రాయెల్ దాడులు చేసిన మాట నిజమేనని, అందులో 90మంది చనిపోయారని, మృతుల్లో డెయిఫ్ లేరని గాజాలోని హమాస్‌కు చెందిన ఆరోగ్య వర్గాలు ధ్రువీకరించాయి.

కర్ణాటక సీఎంకు గవర్నర్ నోటీసుపై మంత్రివర్గం అభ్యంతరం

▸ వెనక్కి తీసుకోవాలని ఏకగ్రీవ తీర్మానం

బెంగళూరు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): మైసూరు నగరాభివృద్ధి ప్రాధికార(ముడా) ఇంటి స్థలాల కేటాయింపు అవినీతి వ్యవహారంలో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్ నోటీసులు జారీ చేయడంపై మంత్రి వర్గం తీవ్ర అభ్యంతరం తెలిపింది. విధానసౌధలో గురువారం సీఎం సిద్దరామయ్య లేకుండా డీసీఎం డీకే శివకుమార్ అధ్యక్షతన క్యాబినెట్ భేటీ జరిగింది. ముడా అవినీతికి సంబంధించి గవర్నర్ జారీ చేసిన నోటీసులు వాపసు తీసుకోవాలని క్యాబినెట్‌లో ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ విషయాన్ని సహకార శాఖ మంత్రి రాజణ్ణ మీడియాకు తెలిపారు. సీఎం సిద్దరామయ్యకు రాజభవన్ నుంచి వచ్చి న షోకాజ్ నోటీసు గురించి చర్చించామని, న్యాయపోరాటం చేయాలని తీర్మానించామని చెప్పారు. గవర్నర్ జారీ చేసిన నోటీసును వాపసు తీసుకోవాలని క్యాబినెట్‌లో తీర్మానించామని పేర్కొన్నారు. ముఖ్యమంత్రికి గవర్నర్ నోటీసు జారీ చేయడం రాజకీయ ప్రేరేపితమని ఆరోపించారు. నోటీసులు తిరస్కరించాలని నిర్ణయం తీసుకున్నామని ఆయన తెలిపారు.

ఉత్తరాది అతలాకుతలం

(మొదటి పేజీ తరువాయి)



వర్షాలకు హిమాచల్‌ప్రదేశ్‌లోని మనాలీలో ధ్వంసమైన రోడ్డు



కోల్పోయారు. కులు జిల్లాలో ఏడుగురు కొట్టుకుపోయారు. మలానా జల విద్యుత్ కేంద్రంలో పలువురు చిక్కుకుపోయారు. బియాస్ నది ఉధృతి, కొండచరియలు విరిగిపడడంతో కీలకమైన మనాలీ-చండీగఢ్ జాతీయ రహదారి పలుచోట్ల తీవ్రంగా దెబ్బతిన్నది. హిమాచల్ సీఎం సుఖుకు కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఫోన్ చేసి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కాగా, రాష్ట్రంలోని పాలంపూర్, చౌరీలో 21 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. ధర్మశాల (18 సెం.మీ.) సహా పలు ప్రాంతాల్లో 10కి పైగా సెం.మీ. వర్షం పడింది. కంగ్రా, కులు, మండిలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే ప్రమాదం ఉందని వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. ఉత్తరాఖండ్‌లో భారీ వర్షాలతో రాత్రికి రాత్రే వరద పోటెత్తింది. పలు నదులు ప్రమాదకర స్థాయిని దాటి ప్రవహిస్తున్నాయి. డెహ్రాడూన్‌లో పరిస్థితి తీవ్రంగా ఉంది. రాష్ట్రంలో మొత్తం 12 మంది మృతిచెందారు. హరిద్వార్‌లోనే ఆరుగురు చనిపోయారు. ఇక్కడ 21 సెం.మీ. వర్షపాతం నమోదైంది. చాలాచోట్ల 10 సెం.మీ. పైన వాన పడింది. కేదార్‌నాథ్ మార్గంలో 1,500 మంది యాత్రికులు చిక్కుకుపోయారు. వీరిలో 425 మందిని హెలికాప్టర్ ద్వారా సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఉత్తరాఖండ్, హిమాచల్‌లో ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, సైన్యం, స్థానిక పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. దేశ రాజధాని ఢిల్లీలోని చాలా ప్రాంతాలు ఇంకా నీటిలోనే ఉన్నాయి. ఆరుచోట్ల ఒక్క రోజులోనే 10 సెం.మీ.పైగా వర్షపాతం నమోదైంది. వివిధ ఘటనల్లో ఐదుగురు చనిపోయినట్లు అధికారులు తెలిపారు. 12 ఏళ్ల బాలుడు, 26 ఏళ్ల యువకుడు విద్యుదాఘాతంతో ప్రాణాలు కోల్పోయారు. మరోవైపు రాజస్థాన్ రాజధాని జైపూర్‌ను వర్షాలు ముంచెత్తాయి. ఓ ఇంట్లోకి వరద చేరడంతో ఆరేళ్ల బాలిక సహా ముగ్గురు మృతిచెందారు. హిమాచల్, పంజాబ్, హరియాణా, ఢిల్లీ, ఉత్తరాఖండ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, కర్ణాటక, ఉత్తరప్రదేశ్, గోవాలకు వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది.

పార్లమెంట్ పైకప్పు లీకేజీ

▸ బీజేపీ ప్రభుత్వంపై ప్రతిపక్షాల మండిపాటు

▸ లీకేజీ స్వల్పమే.. పరిష్కరించాం: కేంద్రం



న్యూఢిల్లీ, ఆగస్టు 1: ఢిల్లీలో కురుస్తున్న భారీ వర్షాలకు కొత్త పార్లమెంటు భవనం పైకప్పు లీకవుతోంది. రూ.1,000 కోట్లకు పైగా ఖర్చు చేసి నిర్మించిన ఈ భవనం లాబీలోని గాజు పైకప్పు నుంచి కింద ఉంచిన బకెట్‌లోకి నీరు ధారగా పడుతున్న వీడియోను సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ సామాజిక మాధ్యమాల్లో షేర్ చేశారు. "కొత్త భవనం కంటే పాత భవనం చాలా మెరుగ్గా ఉంది. వర్షాకాల సమావేశాలను పాతదానిలో ఎందుకు నిర్వహించకూడదు. కనీసం కొత్తదానిలో నీరు కారడం ఆగిపోయే వరకైనా..' అంటూ వ్యంగాస్త్రాలు సంధించారు. ఈ ప్రభుత్వ హయాంలో నిర్మించిన ప్రతి కొత్త భవనం పైకప్పు నుంచి నీరు లీకవడం.. బాగా ఆలోచించి రూపొందించిన డిజైన్‌లో భాగమా అని ప్రజలు అడుగుతున్నారని ఆయన బీజేపీ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. ఈ వీడియోపై కాంగ్రెస్ ఎంపీ మాణిక్కం ఠాగూర్ స్పందించారు. "బయట పేపర్ లీక్.. లోపల వాటర్ లీక్.. నిర్మించిన ఏడాది పూర్తి కాకుండానే పార్లమెంట్ లాబీలో నీరు లీక్ కావడం కొత్త భవనంలో అత్యవసర పునరుద్ధరణ సమస్యలను ఎత్తి చూపుతోంది" అని ఎద్దేవా చేశారు. ఈ అంశంపై చర్చించడానికి ప్రస్తుత లోక్‌సభ సమావేశాల్లో ఆయన వాయిదా తీర్మానం ప్రవేశపెట్టారు. 'రూ.1,200 కోట్ల వ్యయంతో నిర్మించిన పార్లమెంట్ ఇప్పుడు రూ.120 బకెట్‌పై ఆధారపడి ఉంది' అని ఆమ్ ఆద్మీ పార్టీ ఎద్దేవా చేసింది. సెంట్రల్ విస్టా ప్రాజెక్టులో భాగంగా కొత్త పార్లమెంట్ భవనాన్ని 2023 మే 28న ప్రధాని మోదీ ప్రారంభించారు. కాగా, పైకప్పు గ్లాస్ డోమ్‌లకు ఏర్పాటుచేసిన పట్టీలు వదులుగా ఉండటంతో కొత్త పార్లమెంటు భవనం మకర ద్వారం వద్ద స్వల్పంగా నీరు లీకైందని లోక్‌సభ సెక్రటేరియట్ తెలిపింది. సకాలంలో సమస్యను గుర్తించి, వెంటనే మరమ్మతులు చేపట్టామని, అంతటితో నీరు కారడం ఆగిపోయిందని కేంద్ర ప్రభుత్వం వివరణ ఇచ్చింది.

కొనసాగుతున్న శ్రీపాద ఎల్లంపల్లి ఎత్తిపోతలు

పెద్దపల్లి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి మిడ్ మానేరు రిజర్వాయర్‌లోకి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. గురువారం ఎగువ ప్రాంతం నుంచి రాత్రి 9 గంటల వరకు 8,234 క్యూసెక్కుల వరద నీరు వస్తున్నది. ఇందులో క్యాచ్‌మెంట్ ఏరియా నుంచి 5,813 క్యూసెక్కులు వస్తుండగా, కడెం ప్రాజెక్టు నుంచి 2421క్యూసెక్కుల వరద నీరు వస్తున్నది. ఎల్లంపల్లి ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 20.175 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 16.084 టీఎంసీల నీళ్లు ఉన్నాయి. మిడ్ మానేరుకు నంది పంప్‌హౌస్ నుంచి 4 మోటార్ల ద్వారా 12,600 క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు. ఇప్పటి వరకు సుమారు 5.630 టీఎంసీల నీటిని మిడ్ మానేరుకు తరలించారు.

గాయత్రి పంప్‌హౌస్‌ను సందర్శించిన కలెక్టర్

రామడుగు : మండలంలోని లక్ష్మీపూర్ గాయత్రి పంప్‌హౌస్ నుంచి శ్రీ రాజరాజేశ్వర మిడ్ మానేరు జలాశయానికి ఆరవ రోజు నీటి విడుదల కొనసాగుతోంది. ప్రస్తుతం నాలుగు పంపుల ద్వారా 12,600 కూసెక్కుల నీరు విడుదల అవుతోంది. ఇప్పటి వరకు 5.5 టీఎంసీల నీరు మిడ్ మానేరుకు తరలించినట్లు అధికారులు తెలిపారు. పంప్‌హౌస్‌ను గురువారం జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సందర్శించారు. ఈ సందర్భంగా పంప్ హౌస్ నుంచి విడుదలవుతున్న నీటిని పరిశీలించిన అనంతరం అధికారులను పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. పంపుల సామర్థ్యం, విద్యుత్తు వినియోగం, నీటి విడుదల వివరాలను అడిగారు. డీఈఈ రాంప్రదీప్ కలెక్టర్‌కు పలు వివరాలను వెల్లడించారు. మొత్తం 4, 5 పంపుల ద్వారా నీటిని పంపింగ్ చేస్తున్నామని తెలిపారు. ఒక్కో పంపు ద్వారా 3,150 క్యూసెక్కుల నీటిని ఒక రోజుకి ఎత్తిపోస్తున్నామన్నారు. ఒక్కొక్క పంపుకు 139 మెగావాట్ల సామర్థ్యం కలిగి ఉందన్నారు. ఇప్పటి వరకు ఎత్తిపోతలు విజయవంతంగా సాగుతున్నాయన్నారు. గాయత్రి పంప్‌హౌస్‌ప్రాంతాన్ని విజ్ఞాన విహారకేంద్రంగా ఏర్పాటు చేస్తే బాగుంటుందని కలెక్టర్ అభిప్రాయాన్ని వ్యక్తం చేయగా విహార కేంద్రంగా ఏర్పాటు చేయటం ద్వారా సెక్యూరిటీ సమస్యలు వచ్చే అవకాశం ఉందని అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. సాంకేతిక పరిజ్ఞానంతో రూపుదిద్దుకున్న ప్రాజెక్ట్ గురించి విద్యార్థులు తెలుసుకోవాల్సిన అవసరం ఉందని కలెక్టర్ సూచించారు. అనంతరం పంప్‌హౌస్ ప్రాంతంలో కలెక్టర్ మొక్కలను నాటారు.

మిడ్ మానేరుకు కొనసాగుతున్న ఎత్తిపోతలు

బోయినపల్లి: మిడ్ మానేరు ప్రాజెక్టులోకు ఎల్లంపల్లి నుంచి గాయత్రి పంప్ హౌస్ ద్వారా 12వేల 600 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 318 మీటర్లకు ప్రస్తుతం 310.22ఉండగా, నీటి నిల్వ సామర్థ్యం 27.50 టీఎంసీలకు ప్రస్తుతం 11.68 టీఎంసీల మేరకు నీరు నిల్వ ఉంది.



గాయత్రి పంప్ హౌస్ వద్ద పరిశీలిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

ఎస్సారెస్పీలోకి 50 వేల క్యూసెక్కుల నీరు

జగిత్యాల, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి గురువారం వరద నీటి రాక భారీగా పెరిగింది. మహారాష్ట్రలోని అంబూరా, బాలేగావ్ ప్రాజెక్టులు నిండడం వల్ల అక్కడి నుంచి వదులుతున్న నీరు ఎస్సారెస్పీలోకి వస్తోంది. బాబ్లీ ప్రాజెక్టు పైన గల బాలేగావ్ ప్రాజెక్టుకు చెందిన నాలుగు వరద గేట్లను ఎత్తి దిగువకు నీరు వదు లుతున్నారు. గత నెల 31వ తేదీ రాత్రి 9 గంటలకు 11 వేల క్యూసెక్కులను బాలేగావ్ ప్రాజెక్టు నుంచి దిగువకు వదలడం ప్రారంభించగా ఈ నెల 1వ తేదీన ఉదయం 6 గంటల నుంచి సుమారు 50 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. బాలేగావ్ నుంచి బాబ్లీ ప్రాజె క్టులోకి వస్తున్న నీరు బాబ్లీ గేట్లు తెరిచి ఉండడం వల్ల నేరుగా శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి వస్తున్నాయి. గురువారం రాత్రి 8 గంటల వరకు సుమారు 50 వేల క్యూసెక్కుల కుపైగా వరద నీరు ఎస్సారెస్పీలోకి వచ్చి చేరుతోంది.

ప్రాజెక్టు నీటి నిల్వ 90.323 సామర్థ్యానికి ప్రస్తుతం 37.113 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గత యేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 76.499 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జూన్ 1వ తేదీ నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 31.579 టీఎంసీల వరద నీరు వచ్చి చేరింది.

13 మంది సీఐల బదిలీ

కరీంనగర్ క్రైం, ఆగస్టు 1: కరీంనగర్ పోలీస్‌కమిషనరేట్ పరిధిలోని పలువురు సీఐల బదిలీలు జరిగాయి. ఈ మేరకు గురువారం మల్టీజోన్-1 ఐజీ ఉత్తర్వులు జారీ చేశారు. కరీంనగర్ సీఎస్‌బీ-3 సీఐగా పనిచేస్తున్న జి తిరుమల్ హుజురాబాద్ సీఐగా బదిలీ అయ్యారు. హుజూరాబాద్ సీఐగా పనిచేస్తున్న బి రమేష్ కరీంనగర్ సీసీఎస్ సీఐగా బదిలీ చేశారు. అలాగే ఆసిఫాబాద్ జిల్లా వాంఖిడి సీఐ బి శ్రీనివాస్ కరీంనగర్ సీఎస్‌బీ-3 సీఐగా, రాజన్న సిరిసిల్ల జిల్లా సీసీఎస్ సీఐగా పనిచేస్తున్న కె ప్రవీణ్‌కుమార్‌ను పెద్దపల్లి సీఐగా, పెద్దపల్లి సీఐగా పనిచేస్తున్న ఆర్ కృష్ణ ఐజీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఉత్తర్వులు జారీ అయ్యాయి. మల్టీజోన్-1లో మొత్తం 13 మంది సీఐలకు బదిలీలు జరిగాయి.

విద్యుదాఘాతంతో ఒకరి మృతి

గంగాధర, ఆగస్టు 1: మండలంలోని వెంకటయ్యపల్లిలో ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్ తగిలి ఒకరు మృతి చెందాడు. గ్రామానికి చెందిన గుండు అంజయ్య(40) గ్రామంలో గురువారం డిష్ కేబుల్‌ను అమర్చుతున్నాడు. దారి పక్కన ఉన్న 11 కేవీ విద్యుత్ స్తంభానికి నిచ్చెన వేసి వైరు అమర్చుతుండగా ప్రమాదవశాత్తు విద్యుతాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడని గ్రామస్థులు తెలిపారు.

బాధ్యతలు స్వీకరించిన కళాశాలల ప్రిన్సిపాల్స్

కోరుట్ల, ఆగస్టు 1 : ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా గౌసుర్ రహమాన్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన గౌసుర్ రహమాన్‌ను పలువురు అధ్యాపక బృందం స్వాగతం పలికి పూలమాల, శాలువతో ఘనంగా సత్కారించారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రిన్సిపాల్ వాజీద్, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

కొడిమ్యాల : మండల కేంద్రంలోని ప్రభుత్వం జూనియర్ కళాశాల నూతన ప్రిన్సిపాల్‌గా డా.. కె. వెంకటేశ్వర్లు గురువారం బాధ్యతలను స్వీకరించారు. నిర్మల్ జిల్లా ఖడెం కళాశాల ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి బదిలీపై కొడిమ్యాలకు వచ్చిన నూతన ప్రిన్సిపాల్‌కు అధ్యాపకులు, విద్యార్థులు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. కొడిమ్యాలలో విధులు నిర్వహించిన ప్రిన్సిపాల్ సంజీవయ్య గోదావరిఖని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు బదిలీ అయ్యారు. అధ్యాపకులు వేణు, జైపాల్‌రెడ్డి, ప్రమోద్‌కుమార్, క్రిష్ణారెడ్డి, జయశీల, నర్సయ్య, డా.. తిరుపతి, సుమన్, భాస్కర్, ప్రవీణ్, దీక్షిత పాల్గొన్నారు.

కథలాపూర్: ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా బొప్పరాతి నారాయణ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం నారాయణ జిల్లా ఇంటర్మీడియేట్ విద్యాధికారిగా అదనపు బాధ్యతల్లో కొనసాగుతున్నారు. ఇక్కడ పనిచేసిన ప్రిన్సిపాల్ గౌసుర్ రహమాన్ కోరుట్లకు బదిలీపై వెళ్లారు. సారంగాపూర్‌లో పనిచేస్తున్న నారాయణ కథలాపూర్‌కు బదిలీపై వచ్చారు.

కళాశాల అభివృద్ధికి కృషి చేస్తా



మల్లాపూర్‌లో పార్టీ నాయకుడుని పరామర్శిస్తున్న జువ్వాడి నర్సింగరావు

మల్లాపూర్, ఆగస్టు 1 : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల అభివృద్ధికి కావాల్సిన నిధులు మంజూరు చేయిస్తానని కోరుట్ల నియో జకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పార్టీ నాయకుడు జలపతిరెడ్డితో కలిసి జూనియర్ కళాశాలను సందర్శించారు. విద్యార్థులకు తాగు నీటికి ఏర్పాటు మరమ్మతుకు నోచుకోవడం లేదని అధ్యాపక బృందం తెలిపారు. కళాశాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయిస్తానన్నారు. అనంతరం మల్లాపూర్‌కు చెందిన పార్టీ నాయకుడు మరిపల్లి మల్లయ్య ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై చికిత్స పొందుతున్న విషయం తెలుసుకొని ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఈయన వెంట నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, నారాయణరెడ్డి ఉన్నారు.

రైస్‌మిల్ యజమాని అరెస్టు



వెంకట్ రెడ్డి అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ

పెగడపల్లి, ఆగస్టు 1 : వరి ధాన్యం తీసుకుని సీఎంఆర్ బియ్యంగా మార్చి ఇవ్వకుండా మోసానికి పాల్పడిన రైస్‌మిల్ యజమాని గంగం వెంకట్ రెడ్డిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ తెలిపారు. గురువారం మల్యాల సీఐ నీలం రవి, పెగడపల్లి ఎస్ఐ సీహెచ్.రవి కిరణ్‌లతో కలసి డీఎస్పీ రఘుచందర్ రైస్‌మిల్ యజమాని అరెస్టు వివరాలు వెల్లడించారు. డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం పెగడపల్లి గ్రామశివారులోని హరిహర మోడ్రన్ రైస్ మిల్ యజమాని తిరుమాలాపూర్ గ్రామానికి చెందిన గంగం వెంకట్‌రెడ్డి సివిల్ సప్లై కార్పొరేషన్‌తో ధాన్యంను బియ్యంగా మార్చి అప్పగించేందుకు ఒప్పందం చేసుకుని 2022-23 సంవత్సరానికి గాను 12728.74 క్వింటాళ్ల వడ్లను బియ్యంగా మార్చి రూ. 3 కోట్ల 10 లక్షల 82 వేలు కార్పొరేషన్‌కు చెల్లించకుండా మోసానికి పాల్పడ్డట్లు తెలిపారు. సివిల్‌సప్లై జగిత్యాల డిస్ట్రిక్ట్ మేనేజర్ వి.హథీరామ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పెగడపల్లి ఎస్ఐ సీహెచ్.రవి కిరణ్ కేసు నమోదు చేసి విచారణ అనంతరం వెంకట్ రెడ్డిని గురువారం రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ రఘుచందర్ తెలిపారు.

కేంద్ర మంత్రిని కలిసిన బీజేపీ నేత బోగ శ్రావణి

జగిత్యాల, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీని తెలంగాణలో ఏర్పాటు చేయాలని కేంద్ర జౌళిశాఖ, టెక్స్‌టైల్ శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్‌ను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బోగ శ్రావణి ప్రవీణ్ కోరారు. గురువారం నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్‌తో పాటు న్యూఢిల్లీలో కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్‌ను కలిశారు. రాష్ట్రంలో చేనేత పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకవెళ్లారు. సానుకూలంగా స్పందించినట్లు ఆమె తెలిపారు.

విద్యార్థులపై నిర్లక్ష్యం వీడాలి



గురుకులంలో వివరాలు తెలుసుకుంటున్న అంబేద్కర్ యువజన సంఘం నాయకులు

మెట్‌పల్లి రూరల్, ఆగస్టు 1 : తల్లిదండ్రులను విడిచి గురుకుల పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు నిర్లక్ష్యం వీడి ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శి నేరెళ్ల శ్రీధర్ అన్నారు. గురువారం మండలంలోని పెద్దాపూర్ క్యాంపులోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో అస్వస్థతకు గురైన విద్యార్థుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. 55 ఏళ్ల క్రితం నిర్మించిన గదులలో విద్యార్థులను ఉంచడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోరుమంతుల ప్రవీణ్‌కుమార్, మ్యాకల తుక్కారాం, శోభన్, రాస భూమయ్య, గంగాధర్ ఉన్నారు.

మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడిగా రాజు



రాయికల్, ఆగస్టు 1: మండలంలోని రామాజీపేట మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడిగా ఎనుగంటి రాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు. గురువారం స్థానిక సంఘ భవనంలో సభ్యుల కార్యవర్గ సమావేశం జరుగగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సంఘం ఉపాధ్యక్షుడిగా పల్లెర్ల నరేష్, కోశాధికారిగా బద్దం సుధాకర్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులను సంఘ సభ్యులు ఎనుగంటి నరేష్, ఎనుగంటి నాగరాజు, శంకర్, పెద్ద లింబయ్య అభినందించారు.

సాయిబాబా ఆలయంలో ఘనంగా ఉత్సవాలు

కోరుట్ల, ఆగస్టు 1 : పట్టణంలోని సాయిబాబా ఆలయంలో గురువారం ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, అర్చన, అభిషేకలు నిర్వహించారు. భక్తులకు అన్న ప్రసాదానికి బైరినేని సత్యాదేవి జ్ఞాపకర్థం భర్త బైరినేని లక్ష్మణరావు అన్న ప్రసాద కార్యక్రమానికి 20516 రూపాయలు అందజేశారు. ప్రత్యేక పూజలు నిర్వహించి అన్న ప్రసాదం ప్రారంభించారు. భక్తులు ఆలయ అభివృద్ధికి మరింత తోడ్పాటును అందించాలని కార్యనిర్వహణ అధికారి కాంతారెడ్డి కోరారు.

మహాలక్ష్మి ఆలయంలో బీజేపీ నాయకులు పూజలు

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 1: మెట్‌పల్లి పట్టణంలోని మహాలక్ష్మీ అమ్మవారి ఆలయంలో గురువారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సురభి నవీన్ కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆషాడ మాస వనభోజనాల సందర్భంగా అమ్మ వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షులు బొడ్ల రమేష్, నాయకులు పాల్గొన్నారు.

మహిళలకు సీఎం క్షమాపణ చెప్పాలి



జగిత్యాలలో ధర్నా నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

- జడ్పీ మాజీ చైర్ పర్సన్ దావ వసంత
- జగిత్యాలలో బీఆర్‌ఎస్ నాయకుల ఆందోళన
- ప్రధాన రహదారిపై ధర్నా, దిష్టి బొమ్మ దహనాన్ని అడ్డుకున్న పోలీసులు



కోరుట్లలో సీఎం దిష్టిబొమ్మ దహనం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

జగిత్యాల టౌన్, ఆగస్టు 1 : అసెంబ్లీ సమావేశాల్లో సభ్య సమాజం తలదించుకునేలా మహిళా ఎమ్మెల్యేలను ఉద్దేశించి మాట్లాడిన సీఎం రేవంత్ రెడ్డి తక్షణమే యావత్ మహిళా లోకానికి క్షమాపణ చెప్పాలని జడ్పీ మాజీ చైర్ పర్సన్ దావ వసంత డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ పార్టీ మహిళా ఎమ్మెల్యేలపై సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క చేసిన అనుచిత వాఖ్యలకు వ్యతిరేకంగా జిల్లా కేంద్రంలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించారు. తహసీల్ చౌరస్తాలో ప్రధాన రహదారిపై ధర్నా నిర్వహించారు. సీఎం డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. సీఎం దిష్టి బొమ్మను దహనం చేసేందుకు నాయకులు ప్రయత్నించగా పోలీసులకు, నాయకులకు మధ్య తోపులాట జరిగింది. ఈ కార్యక్రమంలో నాయకులు మహేష్, సంధ్యారాణి సురేందర్ నాయక్, స్పందన, అనీల్, ప్రియాంక ప్రవీణ్, మల్లేశం, దేవేందర్ నాయక్, శివకేసరి బాబు, శ్రీనివాస్, శ్రీధర్‌రెడ్డి, మహేష్‌గౌడ్, సత్యనారాయణ ఉన్నారు.

పెగడపల్లి : శాసనసభలో మహిళలను కించపరిచే విధంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారని పేర్కొంటూ దానికి నిరసనగా గురువారం పెగడపల్లి మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. అంబేద్కర్ కూడలిలో ప్రభుత్వానికి, సీఎంకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ప్రభుత్వం బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ అధ్యక్షుడు లోక మల్లారెడ్డి, రాజిరెడ్డి, కరుణాకర్‌రావు, ఉప్పుగండ్ల నరేందర్ రెడ్డి, బొమ్మెన స్వామి, లక్ష్మణ్, రవి, రాజశేఖర్, తిరుపతి, రాచకొండ ఆనంద్, బోగ లక్ష్మి నారాయణ పాల్గొన్నారు.

ధర్మపురి: ధర్మపురి మండల కేంద్రంలోని గాంధీ చౌక్ వద్ద గురువారం బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ కార్యకర్తలు గాంధీ చౌక్ వద్ద సీఎం దిష్టిబొమ్మ దహనం చేస్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ కార్యక్రమంలో ధర్మపురి ఏఎంసీ మాజీ చైర్మన్ అయ్యోరు రాజేష్‌కుమార్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు మొగిలి శేఖర్, పట్టణ అధ్యక్షులు ఆకుల రాజేష్, మాజీ ఎంపీపీ ఎడ్ల చిట్టిబాబు, కౌన్సిలర్లు సయ్యద్ యూనస్, బండారి అశోక్, గుర్రాల సుధాకర్, జిల్లా వక్ఫ్ బోర్డు సభ్యులు సయ్యద్ ఆసిఫ్, స్తంభంకాడి మహేష్ పాల్గొన్నారు.

కోరుట్ల: అసెంబ్లీలో ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డిలపై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా గురువారం పట్టణంలోని కార్గిల్ చౌరస్తా వద్ద బీఆర్‌ఎస్ శ్రేణులు సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేసినా దిష్టిబొమ్మను దహనం చేశారు. సీఎం వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం(మెట్‌పల్లి): అసెంబ్లీలో ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డిలపై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా గురువారం మెట్‌పల్లి పట్టణంలోని పాత బస్టాండ్‌లో బీఆర్‌ఎస్ నాయకులు ఆందోళన చేపట్టారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ మహిళలకు ఇచ్చే గౌరవం ఇదేనా అని విమర్శించారు. రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఎండపల్లి: సీఎం రేవంత్ రెడ్డి వెంటనే క్షమాపణ చెప్పాలని ఎండపల్లి బీఆర్‌ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం బీఆర్‌ఎస్ అధిష్ఠానం పిలుపు మేరకు మండలంలోని తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. సీఎం దిష్టి బొమ్మ దహనం చేయడానికి ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ కార్యక్రమంలో సింహాచలం జగన్, గాజుల మల్లేశం, పందిరి రాజిరెడ్డి, గంధం తిరుపతి, జగన్ మోహన్ రెడ్డి, రియాజ్, దుర్గం కృష్ణ, జాని, వెంకటేష్ పాల్గొన్నారు.



మెట్‌పల్లిలో ఆందోళన చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

వెల్గటూర్: అసెంబ్లీలో మహిళల ఎమ్మెల్యేల పట్ల సీఎం రేవంత్‌రెడ్డి చేసిన అనుచిత వాఖ్యలు బాధాకరమని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాంచంద్రం గౌడ్ పేర్కొన్నారు. గురువారం వెల్గటూర్ మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ నాయకులు నిరసన తెలిపారు. ఈ కార్యక్ర మంలో బీఆర్ ఎస్ మండల ప్రధాన కార్యదర్శి జూపాక కుమార్, లింగ య్య, మూగల సత్యం, బిడారి తిరుపతి, రాజయ్య, అశోక్ పాల్గొన్నారు.

బుగ్గారం: సీఎం రేవంత్‌రెడ్డి మహిళ ఎమ్మెల్యేలను అవమాన పరిచేలా మాట్లాడినందుకు నిరసనగా బుగ్గారంలో బీఆర్‌ఎస్ నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గాలిపెల్లి మహేష్, మాజీ అధ్యక్షుడు మల్లేశం, అబ్దుల్ రహమాన్, రాజేంధర్, సుజాత, పూర్ణచందర్, జగన్, లక్ష్మి బుచ్చన్న పాల్గొన్నారు.

కథలాపూర్: మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ శ్రేణులు సీఎం రేవంత్ రెడ్డి దిష్టి బొమ్మను దహనం చేశారు. మహిళా ఎమ్మెల్యేలను కించపరిచే విధంగా వ్యాఖ్యానించి మహిళల పట్ల కాంగ్రెస్‌కు ఉన్న చిత్తశుద్ధిని నిరూపించుకున్నారని ఆరోపించారు. రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, మాజీ జడ్‌పీటీసీ నాగం భూమయ్య, మాజీ ఎంపీపీ రేవతి, మాజీ వైస్ ఎంపీపీ కిరణ్‌రావు, ఏఎంసీ మాజీ చైర్మన్లు నాగేశ్వర్‌రావు ఉన్నారు.

కొడిమ్యాల : మండల కేంద్రంలోని అంగడి బజారులో మండల బీఆర్ ఎస్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు పులి వెంకటేష్‌గౌడ్, పట్టణ బీఆర్‌ఎస్ నాయకులు కొత్తూరి స్వామి, సింగిల్ విండో డైరెక్టర్ పర్లపల్లి ఆనందం, మాజీ సర్పంచులు ఏగుర్ల తిరుపతి, మల్యాల మహిపాల్, మండల బీఆర్‌ఎస్ నాయకులు వెంకటి, కాయిత రాజు, చంద్రమోహన్ పాల్గొన్నారు.

సుప్రీం తీర్పుపై ఎమ్మార్పీఎస్ హర్షం

ధర్మపురి, ఆగస్టు 1: ఎస్సీ వర్గీకరణ కోసం సుప్రీం కోర్టులో ఏడుగురు సభ్యు లతో కూడిన ధర్మాసనం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన సందర్భంగా ధర్మపురి మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద గురువారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు చందోళి శ్రీనివాస్, రాష్ట్ర నాయకులు పారుపెల్లి రాజమల్లయ్య, ఓరుగంటి చంద్రశేఖర్, బొల్లారపు పోచయ్య, రత్నాకర్, ఇందయ్య పాల్గొన్నారు.

పెగడపల్లి: ఏబీసీడీ వర్గీకరణ న్యాయమైన డిమాండేనంటూ రాష్ట్రాలు వర్గీకరణ చేసుకోవచ్చంటూ సుప్రీం కోర్టు తీర్పు ఇవ్వడాన్ని హర్షిస్తూ గురువారం మండల నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు మహేందర్, శ్రీరాం అంజయ్య, వినోద్, నర్సయ్య, దయాకర్, అంజిబాబు, దుర్గాప్రసాద్, ప్రవీణ్ పాల్గొన్నారు.

కొడిమ్యాల : ఎస్సీ, ఎస్టీల వర్గీకరణ అవసరమేనని సుప్రీం కోర్టు తీర్పు వెలువరించిన నేపథ్యంలో గురువారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. అంతక ముందు టపాసులు కాల్చి సంబురాలు జరుపుకున్నారు. ఎమ్మార్పీఎస్ నాయకులు మహేష్, రవీందర్, ఆనందం, గంగరాజం, శ్రీనివాస్, మల్లేశం, అంజయ్య పాల్గొన్నారు.

● ఎస్సీ, ఎస్టీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పు ఇవ్వటంతో గురువారం సాయంత్రం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద బీజేపీ నాయకులు ప్రధాని మోదీ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేశారు. బీజేపీ నాయకులు బండ నర్సింహారెడ్డి, రాంచందర్‌రావు, చల్ల శ్రీనివాసరెడ్డి, అరుణ్‌కుమార్, రమణాచారి, రమేష్, శంకర్, సాయిబాబా, బాబు, వెంకట్‌రావు, అంజి ఉన్నారు.



ధర్మపురిలో సంబరాలు నిర్వహిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కథలాపూర్ : ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు ఎంతో హర్షణీయమని రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గతంలో బీఆర్ఎస్ సర్కారు అసెంబ్లీలో నాలుగు సార్లు ఎస్సీ వర్గీకరణ బిల్లును పెట్టి కేంద్రంకు పంపించిందని గుర్తు చేశారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీకి నాలుగు సార్లు స్వయంగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కలిసి వినతి పత్రాలు ఇచ్చారని చెప్పారు. ఎస్సీ వర్గీకరణకై కట్టుబడి బీఆర్‌ఎస్ పనిచేసిందని చెప్పారు. ఈ సందర్భంగా మాజీ జడ్‌పీటీసీ నాగం భూమయ్య, మాజీ ఎంపీపీ జవ్వాజి రేవతి, మాజీ వైస్ ఎంపీపీ గండ్ర కిరణ్‌రావు, గుండారపు గంగాధర్ ఉన్నారు.

పోలీసుల అదుపులో దొంగనోట్ల ముఠా?

బీర్‌పూర్, ఆగస్టు 1: జిల్లాలో దొంగనోట్లు చెలామని చేస్తున్న ముఠాను బుధవారం రాత్రి పోలీసులు అదుపులోనికి తీసుకొని విచారిస్తున్నట్లు సమాచారం.

పోలీసులకు అం దిన పక్కా సమాచారంతో నిర్మల్ జిల్లా, దస్తురాబాద్ మండలం, బుట్టాపూర్ గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులతో పాటు జగిత్యాల జిల్లాకేంద్రానికి చెందిన ఒకరు, బీర్‌పూర్ మండలంలోని ఇద్దరు వ్యక్తులు దొంగనోట్లను చలామని చేస్తున్నారని అందిన పక్కా సమాచారం మేరకు ఈ ఐదు గురిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలిసింది.

‘సీఎం కృతజ్ఞత సభను విజయవంతం చేయాలి’

రాయికల్, ఆగస్టు 1: రాష్ట్రంలో 30 వేలకు పైగా పదోన్నతి పొందిన ఉపాధ్యాయులతో ఆగస్టు 2న శుక్రవారం రోజున సీఎం రేవంత్ రెడ్డికి జరిగే కృతజ్ఞత సభలో తెలుగు, హిందీ, ఉర్దూ, పీఈటీ, అన్ని సబ్జెక్టుల ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేయాలని ఆర్‌యూపీపీటీ జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి వేల్పుల స్వామి యాదవ్ కోరారు. అల్లీపూర్ కాంప్లెక్స్ సమావేశంలో భోజన విరామ సమయంలో మాట్లాడుతూ ఈ కృతజ్ఞతకు పాల్గొనే ఉపాధ్యాయులకు ఆన్ డ్యూటీ సౌకర్యం, ఉచిత బస్సులు, భోజన వసతి తదితర ఏర్పాట్లు చేశామన్నారు. జిల్లా నుంచి పదోన్నతి పొందిన భాషోపాధ్యాయులు ఎస్‌ఏ తెలుగు, హిందీ, ఉర్దూ, వ్యాయామ, అన్ని సబ్జెక్టుల ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. బాధ్యులు రాజేశం, వసంత రావు, సురేష్, నర్సయ్య, ఎండీ సయీద్ పాషా, రమేష్ గౌడ్, అహ్మదుల్లా ఖాన్ పాల్గొన్నారు.

వంతెన నిర్మాణ పనులు మొదలయ్యేదెన్నడో..?



ఇబ్రహీంపట్నం- వర్షకొండ మధ్యలో ప్రారంభం కాని లోలెవల్ వంతెన

ఇరు గ్రామాల మధ్య నిలుస్తున్న రాకపోకలు

ఇబ్బందులు పడుతున్న గ్రామస్థులు

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 1: వారం రోజులుగా కురిసిన వర్షాలు వ్యవసాయం పరంగా అన్నదాతలను సంతోష పెట్టినా మరికొందరు ప్రజలకు మాత్రం ఇబ్బందులు తెచ్చి పెడుతోంది. ఇబ్రహీంపట్నం-వర్షకొండ మధ్యలో లోలెవల్ వంతెన, అలాగే ఫకీర్ కొండాపూర్‌లో హైలెవల్ వంతెన పనులు ప్రారంభం కాక ప్రజలు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. వరదలు వస్తే ఇరు గ్రామాల ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుందని వాటిని దృష్టిలో ఉంచుకుని గత ప్రభుత్వంలో మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు 2023లో హై లెవల్ వంతెనల నిర్మాణానికి భూమిపూజ చేసి శంకుస్థాపన చేశారు. నెలలు గడుస్తున్నా ఇప్పటికీ వంతెన నిర్మాణ పనులు మాత్రం ప్రారంభం కాకపోవడం తో ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాంట్రాక్టర్, అధికారులు, పాలకుల నిర్లక్ష్యం కారణంగా సామాన్య ప్రజలకు తిప్పలు తప్పడం లేదు. మండలంలోని యామాపూర్ నుంచి ఫకీర్‌కొండాపూర్ వెళ్లే దారిలో హైలెవల్ వంతెన రూ. 4 కోట్లు, ఇబ్రహీంపట్నం నుంచి వర్షకొండ మధ్య రెండు రోడ్డు డ్యామ్‌లకు 3.30 కోట్లు, కోమటికొండాపూర్ నుంచి ఎర్దండి దారిలో హైలెవల్ వంతెనకు 2 కోట్లు, తిమ్మాపూర్ నుంచి యామాపూర్ మధ్యలో నిర్మాణానికి 80 లక్షల నిధులు 2023లో మంజూరు కావడంతో టెండర్లు కూడా పూర్తయ్యాయి. టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్లు 9 నెలల్లో పనులు పూర్తి చేయాల్సి ఉన్నప్పటికీ ఇంచు పని కూడ మొదలు పెట్టలేదు. టెండరు దక్కించుకున్న వాటిలో కేవలం యామాపూర్-ఫకీర్ కొండాపూర్ మధ్య ఉన్న హైలెవల్ వంతెన పనులను మాత్రమే శరవేగంగా నడుస్తున్నాయి. మిగతా వంతెన నిర్మాణ పనులు ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా తయారైంది. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఆయా గ్రామాలను ఆనుకొని ఉన్న చెరువులు మత్తడి దూకుతున్నాయి. దీంతో కాలువలు ఉధృతంగా రహదారిపై నుంచి ప్రవహిస్తుండటంతో ఆయా గ్రామాల్లో రాకపోకలు నిలిచిపోతున్నాయి. నిత్యం రవాణా చేసే మార్గం వెంబడి రాకపోకలు ఆగిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పోలీసులు, అధికార యంత్రాంగం అక్కడకు చెరుకుని గ్రామస్థులు ఇబ్బందులు కలగకుండా తాత్కాలిక ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. వంతెనల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా కాంట్రాక్టరు నిర్లక్ష్యం కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు, పాలకులు పట్టించుకుని వంతెనల నిర్మాణ పనులు పూర్తి చేయాలని ఆయా గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.

త్వరగా పనులు ప్రారంభించాలి

: పోనకంటి వెంకట్, వర్షకొండ

వంతెనాల నిర్మాణానికి నిధులు మంజూరై నెలలు గడుస్తున్నా కాంట్రాక్టర్ ఇప్పటికీ పనులు ప్రారంభించలేదు. వర్షాలు కురిసిన ప్రతి యేడు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం.అధికారులు స్పందించి బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభించాలి.



ఫకీర్ కొండాపూర్‌లో వంతెనను పరిశీలిస్తున్న డీఎస్పీ

సంక్షిప్తం సమాచారం

జగిత్యాల: రాష్ట్ర శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను గురువారం జగిత్యాలకు చెందిన పలువురు సీనియర్ కాంగ్రెస్ నాయకులు, టీపీసీసీ నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ గుంటి జగదీశ్వర్‌తో పాటు పలువురు నాయకులు మ ర్యాద పూర్వకంగా కలిశారు. హైద్రాబాద్‌లోని శాసన సభ చాంబర్‌లో స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించి అభినందించారు.

జగిత్యాలరూరల్: నేషనల్ హైవే-63 మంచిర్యాల-ఆర్మూర్ భూనిర్వాసితుల సమావేశాన్ని రూరల్ తహసీల్దార్ కార్యాలయం నుంచి పట్టణంలోని మిషన్‌కాం పౌండ్ ఎదురుగా గల ఎస్‌విఎల్‌ఎన్ గార్డెన్ లోకి మార్చామని రాజస్వవమండల అధికారి, భూసేకరణ అధికృత అధికారి తెలిపారు. భూములు కోల్పోతున్న రైతులు రైతులు తమ హక్కుపత్రాలు, బ్యాంక్‌వివరాలతో ఎస్‌వి ఎల్ ఎన్‌గార్డెన్‌లో శుక్రవారం జరిగే సమావేశానికి హాజరై తమ వివరాలను రాతపూర్వకంగా సమర్పించాలన్నారు.

● జగిత్యాల మండలంలోని తిప్పన్నపేట గ్రామంలో నేషనల్ హైవే-63 రహదారి విస్తరణలో భూములు కోల్పోతున్న రైతులకు గురువారం జగిత్యాల మండలం తిప్పన్నపేటలోని గ్రామపంచాయితీలో అర్బన్ రెవెన్యూ అధికారులు నోటీసులు పంపిణీ చేశారు.

జగిత్యాల టౌన్ :పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జగిత్యాల మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని 7వ వార్డులో గురువారం చైర్ పర్సన్ పర్యటించారు.

● ఇళ్ల స్థలాల సాధన కొరకు జగిత్యాల పట్టణ జర్నలిస్టులు చేపట్టిన ఆందోళన మూడవ రోజు గురువారం కొనసాగింది. ఈ సందర్భంగా జర్నలిస్టులు నల్ల బ్యాడ్జీలు ధరించి తమ నిరసనను తెలియజే శారు.

● పట్టణానికి చెందిన ముగ్గురు యువకులు మద్యం మత్తులో మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించారు. స్థానికులు ఆగ్రహించి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు.

● జిల్లా కేంద్రంలోని పోచమ్మ వాడకు చెందిన రేగొండ నరేష్ అనే సామాజిక సేవకుడు 2021లో వంద మందికిపైగా బాధితుల వద్ద అధిక వడ్డీ ఇస్తానని చెప్పి కోట్ల రూపాయల అప్పులు చేసి ఉడాయించాడు. నరేష్‌కు చెందిన ఆస్థిని మంచిర్యాల జిల్లాకు చెందిన శ్రావణ్ అనే వ్యక్తి గతంలో కొనుగోలు చేశాడు. గురువారం పోచమ్మవాడలో ఉన్న నరేష్ ఇంటి ఆస్థిని శుభ్రం చేస్తుండగా బాధితులు ఆందోళన చేపట్టారు. పోలీసులు రంగ ప్రవేశం చేయడంతో సమస్య సర్దుమనిగింది.

ఇబ్రహీంపట్నం(మెట్‌పల్లి టౌన్) : మెట్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలో అక్రమంగా చేపడుతున్న నిర్మాణాలపై అధికారులు చర్యలు తీసుకోవాలని బీజేపీ పట్టణాధ్యక్షుడు బొడ్ల రమేష్ కోరారు. గురువారం మెట్‌పల్లి మున్సిపల్ కమిషనర్ మోహన్ వినతి పత్రం అందజేశారు.

మెట్‌పల్లి రూరల్ : ప్రభుత్వ పథకాలను గీత కార్మికులకు అందేలా కృషి చేస్తానని సర్దార్ సర్వాయి పాపన్న గీతకార్మిక సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ ఏపూరి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మండలంలోని పెద్దాపూర్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ ఏపూరి శ్రీనివాస్‌గౌడ్‌ను సర్దార్ సర్వాయి పాపన్న గీతకార్మిక సంఘం నియోజక వర్గ అధ్యక్షుడిగా నియామక పత్రాన్ని జిల్లా అధ్యక్షుడు చెట్ల చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి నాయిని శ్రీని వాస్ అందజేశారు.

● అప్పుడే పుట్టిన బిడ్డకు ముర్రుపాలు తాగించడం ఎంతో శ్రేష్టమైనవి ఐసీడీఎస్ సూపర్ వైజర్ హైమాది బేగం అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా గురు వారం మండలంలోని కోండ్రికర్ల గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు.

కొడిమ్యాల: మండల కేంద్రంలోని ప్రాథ మిక ఆరోగ్య కేంద్రాన్ని మండలంలోని నాచుపల్లి ఆరోగ్య మందిర్‌ను గురువారం జిల్లా ఇమ్యూనైజేషన్ ఆఫీసర్ ఎ. శ్రీనివాస్ తనిఖీ చేశారు.

ఇబ్రహీంపట్నం: పట్టణంలోని ఎడ్మాల లక్ష్మరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ డైరెక్టర్‌గా ఎన్నికై ప్రమాణ స్వీకారం చేసిన పోతూ సత్యనారయణను, గండి హన్మన్ ఆలయ కమిటీ డైరెక్టర్ ఎన్నికైన రాజకిరణ్‌లను పట్టణ బీసీ సం ఘం నాయకులు గురువారం ఘనంగా సన్మానించారు.

రాయికల్: రాయికల్ మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్‌ను విధుల పట్ల అలసత్వం వహించినందుకు జిల్లా కలెక్టర్ సస్పెండ్ చేయగా గురువారం విధుల్లో చేరారు.

కథలాపూర్ : పాత్రలలో నీరు నిల్వ ఉండే దోమ లార్వా వృద్ధి చెందే అవకాశం ఉందని పల్లెల్లో విస్తృతంగా అవగాహన చేపడుతున్నామని జిల్లా డిప్యూటీ డీఎం హెచ్‌వో శ్రీనివాస్ పేర్కొన్నారు. కథలాపూర్‌లో డెంగీ కేసును గుర్తించిన నేపథ్యంలో గురువారం ఇంటింటికీ సిబ్బందితో కలిసి వివిధ పాత్రల్లో నిల్వ ఉన్న నీటిని పారబోశారు.